క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న డి.తాళ్లవలస, టి.కల్లాల యువకులు

దెంకాడ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డి.తాళ్లవలసకు చెందిన బాధిత కుటుంభానికి డి.తాళ్లవలస, టి.కల్లాలు యువకులు ఆర్థిక సాయం అందించారు. కొద్ది రోజుల కిందట మండలంలోని జొన్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.తాళ్లవలసకు చెందిన వనుము తాత, ఆయన కుమారుడు వనుము సాయి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో డి.తాళ్లవలస, టి.కల్లాలకు చెందిన యువకులు 1.33 లక్షల రూపాయలను అందజేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లిమర్ల రూరల్: వరి సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సంగీత, మండల వ్యవసాయాధికారి పూర్ణిమ సూచించారు. మండలంలోని పారసాంలో వరి నారు మడులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నారు వేసేటప్పుడు కొనలు తుంచి వేస్తే కాండం తొలిచే పురుగు గుడ్లను నివారించవచ్చన్నారు. నాట్లు వేసినప్పుడు కాలిబాటల విధానం పాటిస్తే గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల బెడద ఉండదని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా మోహనరావు



ఎస్పీ వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా పీఎస్ డీఎస్పీ మోహనరావు

విజయనగరం క్రైమ్: మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా టీకు మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ మోహనరావుకు ఎస్సైలు నీలావతి, నారాయణరావు, కేటీఆర్ లక్ష్మి, పద్మావతి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఆకస్మిక తనిఖీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ – 1, ఇందిరా కాలనీ సచివాలయాలను నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ క్యాంపులో భాగంగా సచివాలయ పరిధిలోని ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, శానిటరీ, ఎమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ ప్రభుత్వ స్కూళ్లకే వర్తింపజేయాలి

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ప్రకటించిన ‘తల్లికి వందనం’ పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ప్రతినిధులు వి. రవీంద్రనాయుడు, డి. శ్రీనివాసరావు, రావాడ రాంబాబు, బంకపల్లి శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో వీటీ అగ్రహారం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోర్టు ఏరియా, ప్రదీప్‌నగర్, సీబీ కాలనీ, అలకానంద కాలనీ, బొగ్గుల దిబ్బ, షాలిమార్ హోటల్, వివేకానంద కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ కాలనీ, మయూరి జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారుల దృష్టికి సమస్యలు

- గ్రామసందర్శనలో మొరపెట్టుకున్న గ్రామస్తులు

పూసపాటిరేగ : మండల కేంద్రంలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు అధికారుల మందు ఏకరవు పెట్టారు. మండల కేంద్రంలోని సచివాలయం -1, సచివాలయం -2 పరిధిలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం-1లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు ప్రస్తావించారు. పూసపాటిరేగ మహంతివీధిలో డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజా ప్రతినిధులు మహంతి లక్ష్మణరావు, మహంతి జనార్దనరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ప్రత్యేకాధికారి శాంతికుమారి స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కేజీబీవీలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయని పలువురు తెలిపారు. పూసపాటిరేగ జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న సర్వీస్ రహదారి అంచున డ్రైనేజీ నిర్మించాలని మాజీ ఎంపీపీ చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ పి. సన్యాసినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురపాల భోగేష్ కోరారు. అనంతరం అధికారులు బీసీ బాలుర వసతిగృహం, కళాశాల వసతిగృహాలను సందర్శించారు. అలాగే పూసపాటిరేగ పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారి రాజేష్‌వర్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ ఎం. రాధిక, మండల ఇంజినీరింగ్ అధికారులు మరళీమోహన్, శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటంనాయుడు, సర్పంచ్ టి.సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు పి.లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ పీహెచ్‌సీలో వైద్యాధికారితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు

చొల్లంగిపేటలో..

దెంకాడ: చొల్లంగిపేట పంచాయతీలోని గ్రామాల్లో గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. చొల్లంగిపేట, నగరపుపేట, డీఆర్ పాలెం, సేరిపాలం, తదితర గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి, రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యులు కంది చంద్రశేఖర్, గుడివాడ కిరణ్, సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపీడీఓ లవరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

భోగాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి మండల స్థాయి అధికారులకు సూచించారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కవులవాడ గ్రామాన్ని సందర్శించి, పంచాయతీలో నెలకొన్న సమస్యలపై మండల స్థాయి అధికారులు, గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 వినతులు స్వీకరించి, త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్నం భోజన పథకంతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కొండపు కొత్తయ్యరెడ్డి, ఈఓపీఆర్‌డీ సురేష్, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దెంకాడ: పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భోగాపురం: కవులవాడలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తదితరులు



నెల్లిమర్ల రూరల్: పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తదితరులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

నెల్లిమర్ల రూరల్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పారసాం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ ధర్మరాజు, సర్పంచ్ నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో రాష్ట్రానికి తీరని అన్యాయం

- జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నేతలు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 48 లక్షల కోట్ల బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు అవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సతివాడలో గురువారం వీరు మీడియాతో మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి రీ ఆర్గనైజేషన్ చట్టం ప్రకారం ట్యాక్స్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ ఊసే ఎత్తలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించలేదని, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్, భోగాపురం విమానాశ్రయానికి ప్రత్యేక నిధుల కేటాయింపు, తదితర ప్రధాన ప్రాజెక్టులకు పైసా విదల్చలేదని మండిపడ్డారు. బడ్జెట్‌పై కూటమి నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నిధులు తేలేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నేతలు నరసయ్య, శ్రీనివాసరావు

శాకంబరీదేవిగా గౌరీదేవి



ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి

విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన గౌరీదేవిని శాకంబరీదేవిగా గురువారం అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖరశర్మ ప్రత్యేక పూజాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించారు.

30న మహాధర్నా

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం – విశాఖపట్నం రహదారి మధ్యలో జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాని వెంటనే తొలగించాలని కోరుతూ ఈ నెల 30న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక వేదిక కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, అంబేడ్కర్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పీవీ రమణ, చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి జాగరపు ఈశ్వరప్రసాద్, మాతృభూమి సేవా సంఘం అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు, అమ్మా సేవా సంఘ అధ్యక్షుడు దుక్క శేఖర్, తూర్పు కాపు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్, ధాత్రాజు రాజారావు, గంటా వీర్రాజు (బుజ్జి), తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలంపాట వాయిదా

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ దుకాణాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలంపాటలో పాటదారులు అసమగ్రమైన వివరాలతో హాజరైనందున వాయిదా వేసినట్లు కార్పొరేషన్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణానికి ఆనుకుని ఉన్న 22 దుకాణాలు, అలాగే పాత, కొత్త ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. మొత్తం ఆరుగురు పాటదారులు ఈ వేలంపాటలో పాల్గొన్నారు. అయితే పాటదారులు నిబంధనలను అనుసరించి వేలంపాట ప్రక్రియలో పాల్గొనందున వాయిదా పడింది. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వేలంపాటలో కొన్ని షాపులకు ఒక్కొక్కరే పాల్గొనడం వల్ల పాట నిలిపివేశామన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి షాపునకు ఇద్దరు.. అంతకన్నా మించి పాటదారులు పాల్గొంటేనే వేలంపాట నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే కొందరు రిజర్వేషన్లకు అనుగుణంగా వేలంపాటలో పాల్గొనకపోవడం వల్ల నిలుపుదల చేశామన్నారు. మరలా శుక్రవారం షాపుల బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రాకు అన్యాయం జరిగిందని.. ఈ విషయంలో టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ, రాష్ట్రానికీ కీలకమైన ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం, రాజధానికి నిధులు విడుదల చేయలేదన్నారు. రాజధానికి కూడా 15 వేల కోట్ల రూపాయలు అప్పుగా ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, జగన్‌మోహనరావు, బి. రమణ, వెంకటేశ్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

105 మందికి నేత్ర పరీక్షలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్రవైద్యశిబిరం విజయవంతమైంది. షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు జగన్నాథరాజు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది 105 మంది రోగులను పరీక్షించారు. 32 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేవారు. కార్యక్రమంలో వైద్యుడు వివేక్, క్యాంప్ కోఆర్డినేటర్ జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దంత వైద్యశిబిరం

నెల్లిమర్ల: జరజాపుపేటలోని సత్యజ్ఞానానంద ఆశ్రమంలో అనిల్ నీరుకొండ దంతవైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 175 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఆశ్రమ నిర్వాహకులు, వార్డు కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, నాయకులు నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, వైద్యులు పి. స్వాతి, శ్రీనివాస్, పీఆర్‌ఓ ఎన్. శ్రీనివాస్, హౌస్ సర్జన్ పి. లిఖితా, శ్రీలక్ష్మీప్రసన్న , జ్యోతిక, పావని పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలపై సదస్సు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సర విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలపై నిర్వహించే రెండు రోజుల సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ‘పేషన్ కెరీర్ హబ్’ వ్యవస్థాపకుడు కె.రామలింగరాజు మాట్లాడుతూ.. ఇరవై ఒకటో శతాబ్దానికి అవసరమయ్యే నైపుణ్యాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కెరీర్ మీద స్పష్టత ఎలా సాధించాలి.. రెజ్యూమ్ తయారీ.. ఇంటర్వ్యూ ప్రిపరేషన్ వంటి అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ‘పేషన్ కెరీర్ హబ్’ వ్యవస్థాపకుడు కె.రామలింగరాజు

పర్యావరణాన్ని పరిరక్షించాలి



డివిజన్ పర్యటనలో భాగంగా అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్య రక్షణ కూడా ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా గురువారం ఆయన రెండో డివిజన్‌లో పర్యటించారు. ఫూల్‌బాగ్ కాలనీ, తదితర ప్రాంతాలలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే వాటర్‌ట్యాంక్ వద్ద నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం ఏ విధంగా అమలవుతున్నదీ ఆరా తీశారు. పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత సంరక్షణ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం ఒక్కో డివిజన్‌లో పర్యటిస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందబాబు, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, డీఈలు, ఏఈలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి మజిలీలోనూ ఇబ్బందులే..!

- అంత్యక్రియలు జరపాలంటే నరకయాతన పడాల్సిందే
- కనీస సౌకర్యాలకు నోచుకోని పూసపాటిరేగ శ్మశానాలు

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని పలు శ్మశానాలు అధ్వానంగా మారడంతో చనిపోయిన వారి అంత్యక్రియలు జరిపించడానికి కుటుంబ సభ్యులు, బంధవులు ఇబ్బంది పడుతున్నారు. చివరి మజిలీలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు నాలుగు వేల మంది ప్రజలున్న పూసపాటిరేగలో శ్మశానాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. షెడ్డు, నీటి సదుపాయం మాట పక్కనబెడితే శ్మశానికి వెళ్లేందుకు కనీసం రోడ్డు సదుపాయం కూడా లేకపోవడం శోచనీయం. దీంతో పూసపాటిరేగ బూడివీధి, యాతపేట, శాలిపేట వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. కెళ్లవీధి, రజకవీధి, మహంతివీధికి సంబంధించి కొవ్వాడ రోడ్డులో శ్మశానం ఉంది. ఇక్కడ కనీసం షెడ్డు కూడా లేదు. అలాగే పూసపాటిరేగ పెద్ద చెరువు గట్టు శ్మశానం పరిస్థితి కూడా దయనీయంగా మారింది. మండలంలో చాలాచోట్ల ఉపాధి హామీ నిధులతో శ్మశానాలు అభివృద్ధిచేశారు. కాని పూసపాటిరేగ, కొవ్వాడ శ్మశానాలను అలాగే వదిలేశారు. ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో శ్మశానికి వెళ్లడానికి కూడా వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానల్లో కనీస వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



అడవిని తలపిస్తున్న పూసపాటిరేగ పెదచెరువు సమీపంలో శ్మశానవాటిక

సదుపాయాలు కల్పించాలి..

పూసపాటిరేగ గ్రామంలో పెదచెరువు గట్టు, కొవ్వాడ రోడ్డులో గల శ్మశానాల పరిస్థితి అధ్వానంగా ఉంది. మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో దహనసంస్కారాలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షం వచ్చిందంటే గట్టుపైనే మృతదేహాలను ఉంచాల్సి వస్తోంది. వెళ్లడానికి దారి కూడా లేదు. అధికారులు స్పందించి శ్మశానాల్లో సదుపాయాలు కల్పించాలి.

– పి. ప్రసాద్, గ్రామస్తుడు పూసపాటిరేగ

హెల్మెట్ ధరించకుంటే జరిమానా

బొండపల్లి: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. చందక పేటలో జాతీయ రహదారి–26పై పోలీస్ సిబ్బందితో కలిసి గురు వారం వాహన తనిఖీలు నిర్వహించా రు.హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులకు జరిమా నా విధించారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు బైక్‌లు వల్లే జరుగుతు న్నాయని, చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే, వాహన యజమా నిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



హెల్మెట్ ధరించని వాహన చోదకులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు